క్లుప్తంగా

వైభవంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఫిరంగిపురం: నుదురుపాడు శివారులోని హరిహరసుత అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. రెండురోజులుగా ప్రతిష్ఠాపనాచార్యులు వెంకట పిచ్చియ్యశాస్త్రి ఆధ్వర్యంలో నిత్యపూజలు, హోమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయ ప్రదక్షిణ, పూర్వక శిఖర కలశ ప్రతిష్ఠా మహోత్సవం, పీఠన్యాసం, రత్నన్యాసం, గర్తన్యాసం, యంత్రస్థాపన, సుముహూర్తంలో బింబప్రతిష్ఠ జరిపించారు. కళాన్యాసం చేసి ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

'అక్షయపాత్ర'కు వాహనం అందజేత



మంగళగిరి: ఆత్మకూరు అక్షయపాత్ర ఫౌండేషన్‌కు వాఘ్ బక్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాన్ని అందజేశారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తోంది. వాఘ్ బక్రీ ఫౌండేషన్ అందజేసిన వాహనాన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం సరఫరా చేసేందుకు వినియోగించనున్నట్లు అక్షయపాత్ర యూనిట్ ప్రెసిడెంట్ వంశీధర దాస్ తెలిపారు. కార్యక్రమంలో వాఘ్ బక్రీ ఫౌండేషన్ ప్రతినిధులు అజయ్, సిసీలియా, పీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



మేడికొండూరు: పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్(గుంటూరు) ఆధ్వర్యంలో జరిగింది. ఏఎస్‌ఐ కె.లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఇంటెల్ హైస్కూల్ సెక్రటరీ కోనూనరి రాణి జయకుమార్, ఏఎస్సై జి.బేబి రాణి, స్టేట్ చైల్డ్‌లైన్ నోడల్ కో–ఆర్డినేటర్ బి.సుజ్ఞానరాణి, ఇంటెల్ హైస్కూల్ ప్రిన్సిపల్ సుకన్య, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ షేక్ రన్ను హుస్సేన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



మేడికొండూరు: వెలవర్తిపాడు ఎంపీయూపీ స్కూల్లో సోమవారం పౌష్టికాహార పక్షోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా బాలింతలకు, గర్భిణులకు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు రజిత, లక్ష్మీ, సర్బిన్నుసా పాల్గొన్నారు.

ఫిర్యాదుల నేపథ్యంలోనే వంట ఏజెన్సీ మార్పు

ఎంఈవో తెనాలి ఇందిర

తాడికొండ: తాడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఆది ఆంధ్రా)లో వంట ఏజెన్సీ నిర్వాహకురాలిపై ఆరోపణలు ఉన్నందునే మార్చినట్లు తాడికొండ ఎంఈవో తెనాలి ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. వంట ఏజెన్సీ మార్పు విషయంలో తనపై కొన్ని పత్రికలలో వచ్చిన అవినీతి ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓల త్రిసభ్య కమిటీ ద్వారా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ పంపిన తీర్మానం మేరకు కొత్త నిర్వాహకురాలికి బాధ్యతలు అప్పగించినట్లు ఎంఈవో వెల్లడించారు.

పేదలకు వరం వైఎస్సార్ కంటి వెలుగు

బోరుపాలెం(తాడికొండ): వైఎస్సార్ కంటి వెలుగు పథకం పేదలకు వరమని నేత్ర వైద్యుడు వి.సాంబశివరావు చెప్పారు. తుళ్ళూరు మండలం బోరుపాలెంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆయన 60 మందికి పరీక్షలు నిర్వహించారు. 25 మందికి కళ్ళజోళ్ళు అవసరమని గుర్తించారు. ఐదుగురిని శస్త్రచికిత్సల నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఇతర కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కచెల్లెళ్ల ఆర్థిక వికాసమే లక్ష్యం



వైఎస్సార్ ఆసరా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



కార్యక్రమానికి హాజరైన మహిళలు

- వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు
- భారీగా తరలి వచ్చిన మహిళలు.. కోలాహలంగా యార్డు ప్రాంగణం

మంగళగిరి: అక్కచెల్లెమ్మల ఆర్థిక వికాసం, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చెప్పారు. స్థానిక నిడమర్రు రోడ్డులోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం వైఎస్సార్ ఆసరా చెక్కును ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారత సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని భావించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పథకాన్ని మహిళలకే అందిస్తున్నారని గుర్తుచేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు వైఎస్సార్ ఆసరా ద్వారా మొత్తం రూ.105 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు ఆర్కే వివరించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పథకాలు అమలు చేయగా ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. మహిళాభ్యునతి కోసం కృషి చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మంగళగిరి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, దుగ్గిరాల మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజి, నగర పాల సంస్థ కమిషనర్ యు. శారదాదేవి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు. కార్యక్రమానికి భారీగా హాజరైన మహిళలతో నిడమర్రు రోడ్డుతోపాటు యార్డు ప్రాంగణం కోలాహలంగా మారింది.

ఆగస్టు 7న చేనేత బజార్ ప్రారంభించాలి

పాత బస్టాండ్ ఆవరణలో నిర్మితమవుతున్న ప్రగడ కోటయ్య, వైఎస్సార్ చేనేత భవనాన్ని ఆగస్టు 7న ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని, వేగంగా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులను ఆదేశించారు. సోమవారం చేనేత భవనం నిర్మాణ పనులను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే జూలై చివరి నాటికి భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఆగస్టు 7న తెనాలి రోడ్డులోని దుకాణదారులకు దుకాణాలను కేటాయించాలని, ఆ వెంటనే తెనాలి రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

సంక్షేమం, సామాజిక న్యాయం ప్రభుత్వ లక్ష్యం

వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కత్తెర సురేష్ కుమార్



మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: సంక్షేమం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ చెప్పారు. సోమవారం తుళ్ళూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పాదయాత్రలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీ మేరకు ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు చేయడం జగనన్నకే సాధ్యమైందన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం రుణమాఫీ చేస్తానని డ్వాక్రా మహిళలను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. అంతేగాక 2016 నుంచి సున్నా వడ్డీకీ ఎగనామం పెట్టడంతో రూ.3,036 కోట్ల వడ్డీ బకాయిలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే చెల్లించారని గుర్తు చేశారు. వైఎస్సార్ ఆసరా ద్వారా తాడికొండ నియోజకవర్గంలో మొత్తం రూ.33.59 కోట్ల మేర లబ్ధి చేకూరినట్లు వివరించారు. అనంతరం తుళ్లూరు మండలంలోని మహిళలకు రూ.10.15 కోట్ల విలువైన చెక్కును సురేష్‌కుమార్ అందించారు. అనంతరం మహిళలతో కలిసి ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో తాడికొండ జెడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు ఆలోకం సురేష్, ఆలూరు శ్రీనివాసరావు, గద్దె శ్రీనివాసరావు, కొమ్మినేని దత్తు, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి కొప్పుల శేషగిరిరావు, మండల ఎస్సీ సెల్ నాయకులు శృంగారపాటి సందీప్, మేకల రవి కుమార్, జేసీఎస్ కన్వీనర్ బండి ప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ ఐనవోలు సుధీర్, తురకా శ్రీనివాసరావు, బెజ్జం రాంబాబు, ఆరేపల్లి జోజి, గద్దర్ చెన్నకేశవ మాతంగి, కొప్పుల ఆంద్రేయప్ప పాల్గొన్నారు.

నివాసాలపై నిషేధం సడలెనులే..

- 22ఏ జాబితా నుంచి తొలగింపు ప్రక్రియ షురూ
- తాడేపల్లి ప్రజలకు శుభవార్త
- ఎమ్మెల్యే ఆర్కే చొరవతో పూర్తయిన సర్వే
- వెయ్యిమందికి లబ్ధి



తహసీల్దార్ నాగిరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం వెనుక కొండ చుట్టూ ఉన్న నివాసాల యజమానులకు శుభవార్త. ఈ నివాసాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియ షురూ అయింది. గత ప్రభుత్వాల హయాంలో ఇక్కడి ఆవాసాలను 22ఏ నిషేధిత జాబితాలో పొందుపరిచిన విషయం తెలిసిందే. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో స్థానికులు అధికారుల చుట్టూ తిరిగినా 22ఏ జాబితా నుంచి నివాసాలను తొలగించలేదు. ఎట్టకేలకు మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో అధికారులు సమష్టిగా కృషి చేసి గతంలోలాగా రిజిస్ట్రేషన్లు అయ్యేలా 22ఏ జాబితా నుంచి తొలగించే ప్రక్రియ ప్రారంభించారు. సోమవారం తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఎమ్మెల్యే ఆర్కే సమావేశం నిర్వహించారు. అధికారుల దగ్గర నుంచి వివరాలు సేకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గతంలో తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం వెనుక భాగం గ్రామ కంటంలో ఉండేదని, ఇక్కడి నివాసాలు అన్నీ పక్కా రిజిస్ట్రేషన్ జరిగేవని, అనంతరం కొంతమంది రాజకీయ నాయకుల స్వార్థం వల్ల ఈ ప్రాంతాన్ని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని వివరించారు. నెల రోజుల నుంచి కొండ పోరంబోకును, గ్రామ కంటాన్ని విడదీస్తూ 201 సర్వే నంబర్‌లో అధికారులు సర్వే నిర్వహించారని, కొండ చుట్టూ సుమారు వెయ్యి మంది వందేళ్ల నుంచి నివాసముంటున్నారని, వీరందరినీ గ్రామ కంటంలోకి చేర్చించి పక్కా రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రానికి టౌన్ ప్లానింగ్ అధికారులు తహసీల్దార్‌కు సర్వే చేసిన ప్లాన్ అప్పగిస్తారని, అనంతరం జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్‌ల సమక్షంలో గ్రామ కంటాలను విడదీసి ప్రజలకు మేలు కలిగేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు ప్రవీణ్, కిషోర్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి



తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. సోమవారం దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను తూర్పారబట్టారు. కార్యక్రమంలో సంఘం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం దుగ్గిరాల మండల కార్యదర్శి ఎం.నాగమల్లేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

యర్రబాలెంలో ద్విచక్రవాహనం చోరీ

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడి కథనం ప్రకారం.. శ్రీనగర్ కాలనీకి చెందిన వేమవరపు శ్రీధర్ తన బుల్లెట్ వాహనాన్ని ఆదివారం రాత్రి తన నివాసం ఎదుట రోడ్డుపై పార్కింగ్ చేశాడు. సోమవారం తెల్లవారుజామున శ్రీధర్ నిద్రలేచి చూసే సరికి వాహనం మాయమైంది. సీసీ ఫుటేజిని పరిశీలించిన శ్రీధర్ ఇద్దరు గుర్తు తెలియని దుండగులు తన ద్విచక్ర వాహనాన్ని తీసుకువెళ్లినట్లు రికార్డు అయింది. ఆధారాలతో మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఊడిన చక్రం

ప్రమాదం నుంచి బయటపడిన దంపతులు



మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం డాన్ బాస్కో ఉన్నత పాఠశాల సమీపంలోని ఓ ఇంటి వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన దంపతులు వాహనం రోడ్డుపైకి వచ్చేసరికి వెనుక చక్రం అకస్మాత్తుగా ఊడిపోయింది. దీంతో వాహనంపై ఉన్న దంపతులిద్దరూ రోడ్డుపై కిందపడిపోయారు. వాహనం చక్రం ఊడిపోవడంతో దంపతులు షాక్‌కు గురయ్యారు. అటుగా వెళ్తున్న పలువురు రోడ్డుపై పడ్డ దంపతులను పైకి లేపారు. స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి వారు బయటపడ్డారు.

తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే ఆర్కే



15వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని తాగునీటి సమస్యను 15 రోజుల్లో పరిష్కరించేలా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని 4,6,14,15,16 వార్డులలో ఎమ్మెల్యే ఆర్కే అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో డీఈ కృష్ణారెడ్డితో కలిసి ఇంజినీరింగ్ సిబ్బందితో ఆర్కే సమావేశం నిర్వహించారు. పైప్‌లైన్లపై నివేదిక సిద్ధం చేసి కొత్త పైప్ లైన్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. బకింగ్‌హామ్ కెనాల్ వద్ద ప్రెజర్ శాండ్ ఫిల్టర్‌ను 15 రోజుల్లో ఏర్పాటు చేసి, బోర్లు వేసి తాడేపల్లి పాత ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేయాలని చెప్పారు. అనంతరం పలు కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించి డ్రెయినేజీ, వీధిలైట్లు, రోడ్ల సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఏఈలు కిషోర్, ప్రవీణ్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు సింకా గంగాధర్, వేముల లక్ష్మీ రోజ, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంస్థ నాయకులు ముదిగొండ ప్రకాష్, దాసు, వెంకటరామిరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉండవల్లి శివారు ప్రాంతమైన అద్దేపల్లిలో ఏర్పాటు చేసిన పబ్లిక్ ట్యాప్‌ను ఎమ్మెల్యే ఆర్కే స్థానికులతో కలసి ప్రారంభించారు.

రజక కమ్యూనిటీ హాలు నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సూచించారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలో విస్తృతంగా పర్యటించిన సందర్భంగా ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు ఎమ్మెల్యేను కలిసి రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు నిర్దిష్ట కాల పరిమితిలోపు రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు మోర తోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేద్దాం

తాడేపల్లి పట్టణ పరిధిలోని వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ కందుల వెంకయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై చైర్మన్ కందుల వెంకయ్యతో 45 నిమిషాలు చర్చించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఆలయానికి కోట్ల రూపాయల ఆస్తి ఉన్నా.. అభివృద్ధికి నోచుకోలేదని, ప్రస్తుతం ఆలయానికి ఉన్న ఆదాయంతో అభివృద్ధి పనులు చేపడదామని పేర్కొన్నారు. ఆలయానికి సంబంధించి కనకదుర్గ వారధి వద్ద ఉన్న కోట్ల రూపాయల విలువ చేసే భూమిపై న్యాయ పోరాటం చేద్దామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు, అర్చకుల జీతభత్యాలు, మిగిలిన విషయాలపై లిఖిత పూర్వకంగా అందజేస్తే దేవదాయ శాఖ అధికారులతో మాట్లాడి పనులు చేపడదామని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దొంతిరెడ్డి శ్యామల, తంబా సాంబిరెడ్డి, రేఖా పుష్పావతి,ధర్మ శ్రీనివాసరావు, కుంభ నిర్మల, ఆలయ అర్చకులు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గంటల్లో సమస్య పరిష్కారం



ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా ఉన్న స్థలం



జంగిల్ క్లియరెన్స్ తర్వాత ఇలా..

తాడేపల్లి రూరల్: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో నాలుగు గంటల్లో సమస్య పరిష్కారమైంది. ఫలితంగా స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యేకు ఆరో వార్డు రన్నింగ్ రూమ్ సెంటర్‌లో రైల్వే గోడకు ఆనుకుని ఉన్న స్థలంలో ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు మొలిచాయని, విష పురుగులు, పందులు సంచరిస్తున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణం సమస్య పరిష్కారానికి ఆదేశించారు. జంగిల్ క్లియరెన్సు చేపట్టి, స్థల యజమానుల నుంచి ఖర్చు వసూలు చేయాలని సూచించారు. దీంతో శానిటేషన్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గౌసియా జంగిల్ క్లియరెన్సు చేపట్టారు. నాలుగు గంటల్లో స్థలాన్ని శుభ్రం చేశారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



రామచంద్ర ప్రసాద్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ రామ్‌ప్రసాద్

మంగళగిరి: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్ చెప్పారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో నగర పరిధిలోని కాజకు చెందిన పలువురు బాధితుల నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కాజ, యర్రబాలెంతోపాటు పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సర్వే నంబరు తప్పుగా నమోదైన నూతక్కికి చెందిన వీరంకి ప్రభావతి పొలానికి సంబంధించిన సర్వే నంబరును సరి చేసి అడంగల్, రెవెన్యూ రికార్డులను ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. 2007 నుంచి తాము ఇబ్బందులు పడుతున్నామని, ఇనాళ్లకు భూ సమస్య పరిష్కారం కావడం సంతోషంగా ఉందని ప్రభావతి భర్త రామచంద్ర ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



జేసీబీ వాహనాలను అదుపులోకి తీసుకున్న రెవెన్యూ అధికారులు

పొన్నెకల్లు(తాడికొండ): తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో కొండపై జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను సోమవారం రెవెన్యూ అధికారులు అడ్డుకుని జేసీబీలు, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ, పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తవ్వికొని తరలిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు అధికారులు ఘటనా స్థలానికి వెళ్ళి తవ్వకాలను నిలిపివేయించారు. రెండు జేసీబీలు సీజ్ చేసి తమకు అప్పగించారని, రెవెన్యూ అధికారులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గన్నవరపు శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



ఫిరంగిపురం: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని రేపూడి గ్రామ శివారులో సోమవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఫిరంగిపురంలోని రామాలయం బజారులోని మణికంఠ జనరల్ స్టోర్స్‌లో డెలివరి బాయ్‌గా టి.గౌతమ్(20) పనిచేస్తుంటాడు. ఉదయం నుదురుపాడు అయ్యప్ప ఆలయం వద్ద ఉన్న తండ్రికి కొబ్బరికాయల గోతాం ఇచ్చేందుకు వెళ్లి స్కూటర్‌పై తిరిగి గ్రామానికి వస్తుండగా రేపూడి గ్రామ శివారులోని ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతడు పక్కకు పడిపోగా తలకు తీవ్రగాయాలయ్యాయి. ఫలితంగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు తండ్రి చిన్న సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన పదో తరగతి ప్రశ్న పత్రాలు



దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రశ్నపత్రాల రూట్ ఆఫీసర్ ఏడు కొండలు తదితరులు

తాడేపల్లిరూరల్: 10వ తరగతి ప్రశ్నపత్రాలను సోమవారం దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచేందుకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రశ్నపత్రాల రూట్ ఆఫీసర్, దుగ్గిరాల ఎంఈఓ ఏడుకొండలు మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్నాయని, దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల, ఈమని, పెదపాలెం, చిలువూరు, రేవేంద్రపాడులలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, అలాగే మంగళగిరి మండల పరిధిలోని నూతక్కి సెంటర్‌కు చెందిన ప్రశ్నపత్రాలు కూడా దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లోనే భద్రపరిచనున్నామని వివరించారు. ప్రశ్నపత్రాలకు సబ్జెక్టుల వారీగా సీల్ వేసి ఉన్నతాధికారులు పంపారని, కస్టోడియన్ అధికారులు పరమేశ్వరరావు, సతీష్ సమక్షంలో పోలీస్‌స్టేషన్‌లో భద్ర పరిచామని, వీటిని ఏ రోజుకు ఆ రోజు పరీక్ష సమయానికి 45 నిమిషాల ముందు పోలీసు బందోబస్తు మధ్య ఆయా పరీక్ష కేంద్రాలకు తరలిస్తామని వివరించారు.

భార్య అనుమానాస్పద మృతి కేసులో భర్త అరెస్టు

పెదకాకాని: ఈ నెల 8న నమోదైన భార్య అనుమానాస్పద మృతి కేసులో.. భర్తను సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం గడ్డిపాడుకు చెందిన వీరపనేని మహేష్‌కు.. తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన నవ్యతో నాలుగు నెలల క్రితం వివాహం అయ్యింది. మూడు నెలల గర్భిణి నవ్య, భర్త మహేష్ కుటుంబంతో కలిసి ఆటోనగర్‌లో బైడింగ్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మహేష్ దంపతులు బుధవారం మధ్యాహ్నం ఆటో నగర్ నుంచి ఇంటికి వచ్చి భోజనం చేశారు. మహేష్ తన తల్లిదండ్రులకు భోజనం తీసుకెళ్లగా.. కొంతసేపు నిద్రపోతానంటూ నవ్య ఇంటి వద్దనే ఆగిపోయింది. సాయంత్రం 4 గంటల సమయంలో మహేష్ మరదలు ఇంటికి వచ్చి గదిలో ఉన్న నవ్యను నిద్ర లేపేందుకు ప్రయత్నించింది. ఎంతసేపటికీ ఆమె పలకకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, విషయం చెప్పింది. ఇంటికి వచ్చిన భర్త తలుపులు పగులగొట్టి లోపల చూడగా అప్పటికే నవ్య ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. మృతురాలి తండ్రి శానం విజయేంద్రరావు ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. భార్య ఆత్మహత్య చేసుకోవడానికి భర్తే కారణమని భావించి మహేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.